AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

ప్రకృతి రుణం తీర్చుకునేందుకు..

2



2

మనస్థాపంతో యువకుడి సూసైడ్

ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా తనిఖీ

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణ ప్రజలకు అంతరాయం లేకుండా తాగునీటిని అందించేందుకు చేపడుతున్న అమృత్ 2.0 పనులను ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జీవన్, కౌన్సిలర్ చంద్రయ్యతో కలిసి గురువారం ఐదో వార్డులో పరిశీలించారు. వార్డులో కొత్తగా వేస్తున్న పైప్‌లైన్ పనులు, లీకేజీలున్న ప్రాంతాలను స్వయంగా చూశారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని.. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.

18-6-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

జిల్లాకు మాజీ గవర్నర్ దత్తాత్రేయ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకుడు బండారు దత్తాత్రేయ ఇందూరుకు వచ్చారు. ఆయనకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, కార్పొరేటర్లు స్వాగతం పలికారు. బండారు దత్తాత్రేయ ఆర్ఎస్ఎస్ సీనియర్ కార్యకర్తలు, బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. జిల్లాలో బీజేపీ స్థితిగతులపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్నపథకాలను జిల్లాలో ప్రజలకు తెలియజేయాలని.. అలాగే ఓటరు సవరణపై కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు సైతం దత్తాత్రేయను కలిశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి రాష్ట్రానికే ఆదర్శం

అక్షరటుడే, కామారెడ్డి: మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. గడిచిన 30 రోజుల్లో 159 ఫోన్లు రికవరీ చేసిన సిబ్బందిని గురువారం అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించడంలో జిల్లా పోలీస్ శాఖ రాష్ట్రంలోనే ముందంజలో నిలిచిందన్నారు. ప్రతినెలా 100కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తూ ఈ ఏడాది ఇప్పటివరకు రూ.1.05 కోట్ల విలువైన 658 ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందించామని చెప్పారు. మొబైల్ రికవరీ కోసం ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశామని, ఈ బృందం అత్యాధునిక సాంకేతికతను వినియోగించి గత 30 రోజుల్లోనే రూ.25.44 లక్షల విలువైన 159 మొబైల్ ఫోన్లను రికవరీ చేసిందన్నారు. గత ఏడాది సైతం రూ.3 కోట్ల విలువైన 1,834 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసిన ఘనత కామారెడ్డి పోలీసులదని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 4,939 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి, .7.90 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు విజయవంతంగా అప్పగించినట్లు వెల్లడించారు. రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక బృందాన్ని ఆయన అభినందించారు.

ఉన్నత విద్య.. అందని ద్రాక్ష

- ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థులు
- ఖర్చులు భరించలేక మధ్యలోనే నిలిచిపోతున్న చదువులు
- మాటలకే పరిమితమైన ఎడ్యుకేషన్ హబ్

ప్రతి ఏటా జిల్లాలోని 20కి పైగా డిగ్రీ కళాశాలల నుంచి 3 వేల మందికి పైగా విద్యార్థులు బయటకు వస్తున్నారు. వీరిలో అత్యధికులు మేనేజ్ మెంట్, ఐటీ రంగాలవైపు మొగ్గుచూపుతున్నారు. కానీ జిల్లా కేంద్రంలోనే ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు లేక పోవడంతో హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ బాట పట్టాల్సి వస్తోంది. "డిగ్రీ అయిపోయింది. ఎంసీఏ చేద్దామంటే హైదరాబాద్ వెళ్లాలి. నెలకు రూ.15 వేలు ఖర్చవుతోంది. ఆ భారం మోయలేం" అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు శాపం

జిల్లాలో నగరాలకు వెళ్లి చదువుకునే స్థోమత ఉన్నవారు కొందరైతే, గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల పరిస్థితి దయనీయంగా ఉంది. హాస్టల్ ఫీజు, భోజనం, రవాణా, కళాశాల ఫీజు కలిపి నెలకు రూ.20 వేలకు పైగా ఖర్చవుతుండటంతో చాలామంది మధ్యలోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. చివరకు రూ.10 వేల జీతానికి ప్రైవేట్ ఉద్యోగాల్లో చేరిపోతున్నారు. ఐటీ, మేనేజ్‌మెంట్ రంగాల్లో లక్షల జీతాల ఉద్యోగాలు ఊరిస్తున్నా, అర్హత లేక వాటికి దూరమవుతున్నారు.

విన్నపాలు వృథానేనా?

పదేళ్లుగా విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనైనా ఈ కోర్సులు ప్రారంభిం చాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టు కుంటూనే ఉన్నారు. అధికారులకు వినతిపత్రాలు, ఎమ్మెల్యేలకు విజ్ఞప్తులు ఇస్తున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఓ వైపు ప్రభుత్వం 'స్కిల్ డెవలప్‌మెంట్' అంటోంది. మరి స్కిల్ కోసం కావాల్సిన కోర్సులే ఇక్కడ లేవని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి.

> కామారెడ్డి ఎడ్యుకేషన్ హబ్ మాట కాగితాలకే పరిమితం అవుతోంది. ఇక్కడికి ఎన్నికల ప్రచారానికి వచ్చే ప్రతి నాయకుడు జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని హామీలు గుప్పించినా అది ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. ఫలితంగా ఉన్నత చదువుల కోసం విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలో అన్ని వసతులు.. ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నా ఉన్నత విద్య మాత్రం మిథ్యగానే మిగిలిపోతోంది.
>
> - అక్షరటుడే, కామారెడ్డి

ప్రజాప్రతినిధులు స్పందించేనా?

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఈ అంశంపై వెంటనే దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తక్షణమే ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు మంజూరు చేయించి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో నిరుపేదలకే ప్రాధాన్యత

అక్షరటుడే, ఎల్లారెడ్డి: గుడిసెల్లో నివసించే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో తొలి ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జుక్కల్ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అదనపు కలెక్టర్ గిరి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ దశకు అనుగుణంగా డేటా సక్రమంగా అప్‌డేట్ అయ్యిందో లేదో అధికారుల ద్వారా పరిశీలించుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులకు వేతనాలు అందేలా చూడాలి..

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని మైనారిటీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకులు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని టీఆర్ఎస్వీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు యూఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని గురువారం కలిశారు. వారికి తక్షణమే జీతాలు అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు షాహిద్, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

జిల్లాలో 'సర్' ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షరటుడే నిజామాబాద్ సిటీ: జిల్లాలో 'సర్' ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో గురువారం నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈనెల 25 నుంచి జూలై 24 వరకు

బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బీఎల్‌వోలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారి శాఖలకు సంబంధించిన విధుల నుండి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్ఐఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్లారా.. మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని సూచించారు. ఎస్ఐఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని కలెక్టర్ హితవు పలికారు. శిక్షణా తరగతులలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రేవంత్ తుగ్లక్ పాలనలో రైతులు రోడ్డు పాలయ్యారు: ప్రశాంత్‌రెడ్డి

అక్షరటుడే, భీమ్‌గల్: రాష్ట్రంలో రేవంత్ రెడ్డిది 'తుగ్లక్ పాలన' అని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాల్కొండలోని ఎన్‌హెచ్-63 వేల్పూర్ క్రాస్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను రోడ్లపైకి లాగిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని మండిపడ్డారు. 'ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం ఎన్నటికీ బాగుపడదు' అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో రారాజులా బతికిన రైతు.. నేడు కాంగ్రెస్ పాలనలో కరెంట్, ఎరువుల కోసం రోడ్లెక్కి కొట్లాడాల్సిన దౌర్భాగ్యం దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కాలంలో ముందస్తుగా ఎరువుల నిల్వలు సిద్ధం చేసేవారమని, కొరత వస్తే తాము ఢిల్లీకి వెళ్లి కేంద్రంతో పోరాడి అదనపు కోటాలు తెచ్చామని గుర్తుచేశారు. జిల్లాలో ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయంటూ అధికారులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో 3 లక్షల మంది రైతులకు గానూ కేవలం 4 లక్షల యూరియా సంచులు మాత్రమే పంపిణీ చేశారని, అంటే ఒక్కో రైతుకు కనీసం రెండు బస్తాలు కూడా అందలేదని ఎద్దేవా చేశారు. జిల్లాలో 6 లక్షల ఎకరాల సాగు భూమికి గానూ కనీసం 24 లక్షల బస్తాల యూరియా అవసరముండగా.. ఇంకా 20 లక్షల బస్తాల కొరత పెట్టుకుని స్టాక్ ఫుల్‌గా ఉందని ప్రకటించడం బాధ్యతారాహిత్యమన్నారు. చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే సొసైటీలు డిఫాల్ట్ అయ్యాయంటూ కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, సొసైటీలు లేని ప్రైవేటు దుకాణాల్లో కూడా యూరియా ఎందుకు దొరకడం లేదని ప్రశ్నించారు. రంగాన్ని అటు కేంద్రంలోని బీజేపీ, ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి దెబ్బ తీస్తున్నాయని వేముల ఆరోపించారు. టీవీల్లో ప్రకటనల కోసం రూ. కోట్లల్లో ఖర్చు పెడుతున్న రేవంత్ ప్రభుత్వం.. ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకుండా 'రైతు బీమా' పథకాన్ని అటకెక్కించిందని, మరణించిన రైతు కుటుంబాల కన్నీళ్లు తుడువాలనే కనీస బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని ఆయా డివిజన్లలో సమస్యల పరిష్కారానికి నిరంతరంగా కృషి చేస్తున్నామని మేయర్ ఉమారాణి తెలిపారు. నగరంలోని పలు డివిజన్‌లలో గురువారం ఆమె పర్యటించారు. నగరంలోని 37 39 డివిజన్‌లలో మేయర్ కూరగాయల ఉమారాణి పర్యటించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ రోడ్ల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తమ దృష్టికి తెచ్చిన సమస్యలపై వెంటనే స్పందించిన మేయర్ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణ, కాలువల శుభ్రత, దోమల నివారణ చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆమె హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి: రిజిస్ట్రార్

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నేటి సమాజంలో విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని.. తమ లక్ష్యాలను చేరుకునేందుకు సామర్థ్యాలను పెంపొందించుకోవాలని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. నగరంలోని శ్రీరామ గార్డెన్స్‌లో కాకతీయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో స్నాతకోత్సవం నిర్వహించారు. తెయూ రిజిస్ట్రార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీ ప్రపంచంలో తట్టుకునే నిలబడాలంటే విద్యార్థినులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ముందుకెళ్లాలని రిజిస్ట్రార్ సూచించారు. అనంతరం ఆయన విద్యార్థినులకు ఇంజినీరింగ్ పట్టాలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ చెరుకూరి రజనీకాంత్ విద్యార్థినులను అభినందించారు. వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో మా కళాశాల నుంచి 232 మంది విద్యార్థినులు ఇంజినీరింగ్ పట్టాలు పొందడం.. చాలామంది వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సెల్యం కుమార్ రాజా మాట్లాడుతూ మా కళాశాల నుంచి పట్టాలు పొందిన విద్యార్థినులు ఏ రంగంలో ఉన్నా కళాశాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్టేట్ మేనేజర్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.సాయిరెడ్డి, వివిధ శాఖల అధిపతులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: తలసేమియా బాధితుల కోసం విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమని ట్రాన్స్‌కో ఎస్ఈ (ఆపరేషన్స్) పీవీ రాజేశ్వరరావు అన్నారు. ప్రపంచ రక్తదాత వారోత్సవాలను పురస్కరించుకొని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయంలోని గోల్డెన్ జూబ్లీ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ పీవీ రాజేశ్వరరావు, బోధన్ డీఈ ఆపరేషన్స్ మహమ్మద్ ముక్తార్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు,డీఈలు శ్రీనివాసరావు, వెంకటరమణ, హరిచంద్ర నాయక్, తోట రాజశేఖర్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ట్రాన్స్‌కో ఏడీఈ తోట రాజశేఖర్, పీవో పోశెట్టి, విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు రఘునందన్, పూదరి గంగాధర్, గంగారాం నాయక్, బాలేష్ కుమార్, చంద్రశేఖర్, అశోక్ కుమార్, కాశీనాథ్, రాజేందర్, వేణుగోపాల్, సురేష్ కుమార్, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన అమీర్ నగర్ సర్పంచ్

అక్షరటుడే, కమ్మర్ పల్లి: మండలంలోని అమీర్ నగర్ సర్పంచ్ నీలవేణి దశరథ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పలువురు పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి మండలం అధ్యక్షుడు భాస్కర్, మాజీ అధ్యక్షుడు రవి నాయక్, ఇనాయత్ నగర్ సర్పంచ్ బాణావత్ లలిత రాములు నాయక్, ఉపసర్పంచ్ మకిలి అనిల్, డీసీసీ కార్యదర్శి సంజీవ్, గ్రామ అధ్యక్షుడు కందరి భూమారెడ్డి, క్యాతం గంగారెడ్డి, కనూరి లింబాద్రి, పుప్పాల నర్సయ్య, రాజులు రమేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బడుల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

అక్షరటుడే, కామారెడ్డి: రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ నిర్ణయం పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్రలో భాగమని ఆరోపిస్తూ కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ఏబీవీపీ నేతలు ధర్నాకు దిగారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాలికొదిలేసిందని, పేద, బడుగు వర్గాల విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో 25 శాతం సీట్లు ఇచ్చే విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ రక్తం పీల్చుతున్న కార్పొరేట్ విద్యామాఫియాపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టం తేవాలన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉమ్మడిజిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ సైతం బస్సులను ప్రత్యేకంగా నడుపుతోంది. విద్యార్థులు స్కూళ్లకు వెళ్లే రూట్లలో సర్వీసులను పునరుద్ధరించింది.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి

విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు సిద్ధం..

■ ఉమ్మడిజిల్లాలో 65 రూట్లలో పునరుద్ధరణ ■ 227 పనిదినాలకు తగ్గట్లుగా బస్సుల ఏర్పాటు

కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం 65కు పైగా రూట్లలో బస్సులను పునరుద్ధరించారు. మండలాల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఉదయం 7 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 3:30నుంచి 5:30 గంటల మధ్య అదనపు ట్రిప్‌లను నడుపుతున్నారు. జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల, మోడల్ స్కూళ్లకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు.

నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఆయా రూట్లలో ఆర్టీసీ అదనపు బస్సులను సిద్ధం చేసింది. నగరం నుంచి ఆర్మూర్, బోధన్, బాల్కొండ, మోర్తాడ్, కోటగిరి మండలాలకు స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సులు నడుస్తున్నాయి. రూరల్ ప్రాంతాల నుంచి నిజామాబాద్ పట్టణంలోని ప్రైవేట్, గవర్నమెంట్ స్కూళ్లకు వచ్చే విద్యార్థుల కోసం 15 అదనపు ట్రిప్పులు కేటాయించారు.

ఎండీ ప్రత్యేక అదేశాలు..

విద్యార్థులకు కోసం ప్రత్యేకంగా నడుస్తున్న సర్వీసులను అన్ని రీజియన్ల అధికారులు, డిపో మేనేజర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఎండీ సూచించారు. గతంలో నడిచిన అన్ని స్కూల్ రూట్లను యథావిధిగా నడపాలని, విద్యార్థులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఖచ్చితమైన సమయపాలన పాటించాలని ఆదేశించారు. పాసుల కోసం సంబంధిత డిపోలో దరఖాస్తు చేసుకోవాలని, ఏమైనా సమస్యలుంటే హెల్ప్‌లైన్ 9959229922ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా..

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల కోసం తిరిగి బస్సులను ప్రారంభించాం. మార్చి నెలలో నిలిపివేసిన బస్సులను జూన్‌లో తిరిగి ప్రారంభించాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వారి పాఠశాల సమయాలకు అనుగుణంగా సర్వీస్‌లు నడుస్తాయి.

– దినేష్ కుమార్, డీఎం కామారెడ్డి ఆర్టీసీ

శ్రీ చైతన్య బుక్‌స్టోర్స్ సీజ్ చేయాలి

అక్షరటుడే, ఆర్మూర్: అనుమతి లేకుండా పాఠ్య పుస్తకాలు, దుస్తులను విక్రయిస్తున్న ఆర్మూర్ శ్రీ చైతన్య బుక్స్ స్టోర్‌ను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్టోర్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. పట్టణంలో ప్రభుత్వ నిబంధనలను, హైకోర్టు జీవోను సైతం లెక్కచేయకుండా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నప్పటికీ స్థానిక ఎంఈవో చూసీచూడనట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు డి నిఖిల్, నాయకులు వినోద్, భూమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రఫీ గౌహర్

అక్షరటుడే, ఆర్మూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ప్రెసిడెంట్‌గా సీనియర్ లయన్ మొహమ్మద్ రఫీ గౌహర్ నియమితులయ్యారు. పట్టణంలో గురువారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్ రఫీ గౌహర్ గతంలో సైతం ప్రెసిడెంట్‌గా జోన్ ఛైర్మన్‌గా రీజినల్ ఛైర్మన్‌గా జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేశారు. మరోసారి 2026 27కు గాను ప్రెసిడెంట్‌గా ఆయన నియమితులయ్యారు. కార్యదర్శిగా అంబాల తిరుపతి, ట్రెజరర్‌గా సుధీర్ బాబును ఎన్నుకున్నారు.

ఆదర్శంగా నిలిచిన సర్పంచ్

అక్షరటుడే, లింగంపేట: లింగంపేట మండలం ముస్తాబాద్ పంచాయతీ సర్పంచ్ రాధ నారాయణ ఆదర్శంగా నిలిచారు. తన ఇద్దరు పిల్లలను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించి శభాష్ అనిపించుకున్నారు. గురువారం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ తన ఇద్దరు పిల్లలతో ప్రభుత్వ స్కూల్‌లో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని.. అందుకే నా పిల్లలను ఇందులో చేర్పించానన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంఈవో అంజల్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి రుణం తీర్చుకునేందుకు..

■ ఉమ్మడిజిల్లాలో హరితహారం ప్రారంభం.. ■ 'అమ్మ' పేరుతో ఇంటింటా ఓ మొక్క.. ■ ఏర్పాట్లు చేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని గురువారం అటవీ శాఖ అధికారులు ప్రారంభించారు. అనంతరం జిల్లాల్లోని అన్ని పంచాయతీలు, నర్సరీలు, ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఈ సీజన్‌లో మొక్కలు నాటే పక్రియను అధికారులు వేగవంతం చేయనున్నారు

– అక్షరటుడే, ఎల్లారెడ్డి

ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించింది. జిల్లా కలెక్టరేట్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు సమన్వయంతో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. కామారెడ్డి జిల్లాలో జూన్ 5 నుంచి 15 వరకు ప్రతివార్డు, ప్రతి గ్రామంలో 'ఒక ఇల్లు ఒక మొక్క' కార్యక్రమం నిర్వహించనున్నారు. నాటిన మొక్కకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్ వేసి మూడేళ్లు పర్యవేక్షిస్తారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థలు ఇంటింటికీ గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్నారు. పాఠశాలల్లో 'బెస్ట్ గ్రీన్ స్కూల్' నిర్వహించి గెలిచిన స్కూల్‌కు 1000 మొక్కలు బహుమతిగా ఇవ్వనున్నారు.

రోడ్ల పక్కన, చెరువు కట్టలపై..

ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు రోడ్ల పక్కన, చెరువు కట్టలపై మొక్కలు నాటేందుకు ప్రజలను ఆహ్వానిస్తున్నాయి. 'నా చెట్టు నా బాధ్యత' యాప్ ద్వారా నాటిన మొక్క ఫొటో అప్‌లోడ్ చేస్తే సర్టిఫికెట్ కూడా ఇస్తారు. అధికారులు మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకలు హోటల్‌లో కాకుండా ఓ మొక్క నాటి చేసుకోవాలని సూచిస్తున్నారు. పెళ్లి రోజున 10 మొక్కలు నాటితే జీవితంలో పచ్చదనం నెలకొంటుందన్నారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా స్కూళ్లు, ఆస్పత్రుల్లో 'మియావాకి అడవులు' పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం వద్ద మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వృక్ష సంపద పెరిగేలా హరితహారం

కామారెడ్డి జిల్లాలో 24.64 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టారు. ప్రతి గ్రామంలోనూ మొక్కలు నాటి సంరక్షించేందుకు కమిటీలు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతాలు, బంజరు భూములు, రోడ్ల పక్కన, చెరువు కట్టలపై, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా మొక్కలు నాటనున్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. గొర్రెలు, మేకల నుంచి రక్షణ కోసం కంచెలు ఏర్పాటు చేశారు. 18 నెలల

పాటు మొక్కల సంరక్షణ బాధ్యత స్థానిక ప్రజలకే అప్పగించారు.

శాఖల వారీగా నాటుతున్న మొక్కల వివరాలు

కామారెడ్డి జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 10.50 లక్షల మొక్కలు నాటనున్నారు. అలాగే 7.02 లక్షల మొక్కలను మున్సిపల్ పరిధిలో, 2.50 లక్షల మొక్కలు అటవీ ప్రాంతాల్లో, 1.10 లక్షల మొక్కలు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో, 2.20 లక్షల మొక్కలు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాటేందుకు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని అన్ని శాఖల ఆధ్వర్యంలో 24.64 లక్షల మొక్కలను నాటేందుకు హరితహారం పథకంలో ప్రణాళిక సిద్ధం చేశారు.

జిల్లాలో ఆర్టీఏ అధికారుల విస్తృత తనిఖీలు..

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ/ఆర్మూర్: జిల్లావ్యాప్తంగా ఆర్టీఏ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపైకి వస్తున్న బస్సులను పరిశీలిస్తూ జరిమానాలు విధిస్తున్నారు. నిజామాబాద్ నగరంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల ఆదేశాల మేరకు ఆర్టీవో సంతోష్ నాయక్ తనిఖీలు చేపట్టారు. ఉదయాన్నే విద్యార్థులతో రోడ్లపైకి వచ్చిన బస్సులను పరిశీలించారు. బస్సు ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఫైర్ సేఫ్టీ పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 800కు పైగా స్కూల్ బస్సులు ఉండగా కొన్ని ఇంకా ఫిట్‌నెస్ పూర్తి చేసుకోలేదన్నారు. ఈ తనిఖీల ప్రక్రియ నిరంతరంగా సాగుతుందని.. బస్సులతో వాహనదారులు రోడ్లపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా తమ వెంట లైసెన్స్, ధ్రువపత్రాలు తీసుకెళ్లాలన్నారు. ఆర్టీఏ అధికారులకు సహకరించాలని కోరారు. పట్టణంలో గురువారం ఆర్మూర్ ఎంవీఐ రాహుల్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిమితికి మించి స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను సీజ్ చేశారు. స్కూల్ బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలని, వాహనపత్రాలు డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరి అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ రోహిత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావట్లేదని మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

అక్షరటుడే, బాన్సువాడ: భార్య కాపురానికి రావడం లేదనే మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మోస్రాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోస్రాకు చెందిన గంగా ప్రసాద్ (24)కు నవీపేట మండలం అభంగపట్నం గ్రామానికి చెందిన మమతతో వివాహం జరిగింది. అయితే కుటుంబ కారణాల నేపథ్యంలో మమత ఐదు నెలలుగా భర్త వద్దకు రాకుండా తన పుట్టింట్లోనే ఉంటున్నట్లు సమాచారం. భార్య తిరిగి కాపురానికి వస్తుందనే ఆశతో గంగాప్రసాద్ పలుమార్లు ప్రయత్నించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.